www.aknu.edu.in
nannayavani@aknu.edu.in
nannayanewstv
Adikavi Nannaya University
9701293231

విశ్వవిద్యాలయ స్థాయి తొలి తెలుగు వార పత్రిక

# నన్నయ వాణి

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం - ఆంధ్రప్రదేశ్

గౌరవ సంపాదకులు
ఆచార్య మొక్కా జగన్నాథరావు
ఉపకులపతి

ప్రధాన సంపాదకులు
ఆచార్య తుపాకుల అశోక్
కుల సచివులు

సంపాదకులు
డా. తలారి వాసు, సహాయాచార్య, తెలుగు శాఖ
పువ్వల ఆనంద్, ప్రజా సంబంధాల అధికారి, కోఆర్డినేటర్, మీడియా సెల్

సంపుటి : 2 | సంచిక : 17 | 31-01-2022 | పుటలు : 4

## త్రికరణశుద్ధిగా పని చేయడమే దేశభక్తి



జాతీయజెండాను ఆవిష్కరిస్తున్న వీసీ జగన్నాథరావు

**26.01.22 (మీడియాసెల్)** సర్వ సత్తాక, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య, గణతంత్ర భారతదేశానికి కృషి చేసిన మహనీయులను స్ఫూర్తిగా తీసుకొని, అందరూ త్రికణశుద్ధిగా పనిచేయాలని అదే దేశభక్తి అని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో 73వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావు జాతీయ జెండాను ఎగురవేసి విద్యార్థుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ మహనీయులను ఆదర్శంగా తీసుకొని దేశాభివృద్ధికి పాటు పడాలని అన్నారు. దేశాభివృద్ధికి పాటుపడిన నాయకులను, సంఘసంస్కర్తల జీవితాలను గురించి నేటితరం యువత తెలుసుకోవాలని వారి మార్గంలో పయనించాలని చెప్పారు. అల్లూరి సీతారామరాజు, సర్ అర్థర్ కాటన్, కందుకూరి వీరేశలింగం, టంగుటూరి ప్రకాశం పంతులు, చిలకమర్తి లక్ష్మీనరసింహం వంటి ఎందరో మహనీయులు గోదావరి ప్రాంతంలో సేవలందించారన్నారు. రాజమహేంద్రవరం నగరానికి ఎంతో ఘనమైన చరిత్ర ఉందని ఈ ప్రాంతంలో ఉన్న ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం మరింత అభివృద్ధి సాధించాలన్నారు. విశ్వ విద్యాలయంలోని అందరూ పట్టుదలతో పనిచేసి విశ్వవిద్యాలయ అభివృద్ధికి పాటుపడాలని పిలుపునిచ్చారు. కోవిడ్ వంటి విపత్కర పరిస్థితుల్లో కొత్త ఆలోచనలతో విశ్వవిద్యాలయాన్ని అభివృద్ధి పథంలో నడిపించామని దేశభక్తి స్ఫూర్తితో మరింత అభివృద్ధి దిశగా అడుగులు వేద్దామని సూచించారు. తరువాత చిలకమర్తి లక్ష్మీనరసింహం మనుమలు పెరుమాళ్ళ రఘునాథ్ మాట్లాడుతూ జాతీయోద్యమ సమయంలో రాజమహేంద్రవరంలో బిపిన్ చంద్రపాల్ ఉపన్యాసాలను తెలుగు అనువాద ఉపన్యాసం చేస్తూ ప్రజల్ని స్వాతంత్ర్యోద్యమ ఉత్తేజితుల్ని చేసిన మహనీయులు చిలకమర్తి లక్ష్మీనరసింహం అని కొనియాడారు. వారు ఎన్నో దేశభక్తి రచనలను చేసి సమాజానికి అందించారని అన్నారు. స్వాతంత్రోద్యమం, సంఘసంస్కరణలు, సాహిత్యాలకు సంబంధించిన ఎన్నో చారిత్రక ప్రాంతాలు రాజమహేంద్రవరంలో ఉన్నాయని విద్యార్థులంతా వాటిని దర్శించి విజ్ఞానాన్ని దేశభక్తిని పెంచుకోవాలన్నారు. రాజ్యాంగం కల్పించిన ఫలాలను పూర్తిగా అందుకోవాలని విధులను, బాధ్యతలను గుర్తెరిగి ఉత్తమ పౌరులుగా యుతవరం ముందుకు సాగాలని సూచించారు. విశ్వవిద్యాలయ అధికారులు పెరుమాళ్ళ రఘునాథ్ ను సన్మానించి జ్ఞాపికను అందజేసారు. ఇటీవల ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ వెయిట్ లిఫ్టింగ్ పోటీలలో గోల్డ్ మెడల్ సాధించిన ఏలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి ఎం.దీపనయోమి రూ.25.000, సిల్వర్ మెడల్ సాధించిన వి.ఎస్.లక్ష్మీ ఉమెన్స్ డిగ్రీ కాలేజ్ కాకినాడ విద్యార్థి పి.ధరణి కి రూ.20.000 చెక్కులను అందించి సన్మానించి అభినందనలు తెలియజేసారు. ఎం.పి.ఈ.డీ విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు, యోగా ప్రదర్శనలు నిర్వహించారు. అనంతరం డా.బి.ఆర్.అంబేద్కర్ లైబ్రరీలో భారత రాజ్యాంగ నిర్మాతలకు పూలమాలవేసి నివాళులర్పించి, రాజ్యాంగ ప్రతిని దర్శించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య తుపాకుల అశోక్, ప్రిన్సిపాల్స్ ఆచార్య ఎస్.టేకి, డా.వి.పెర్సిస్, ఆచార్య వై.శ్రీనివాసరావు, డీన్స్ డా.ఎ.మట్టారెడ్డి, డా.పి.వెంకటేశ్వరరావు మరియు విశ్వవిద్యాలయ అధికారులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.



పెరుమాళ్ళ రఘునాథ్‌ను సన్మానిస్తున్న అధికారులు




రాజ్యాంగ ప్రతిని సందర్శించిన వీసీ,అధికారులు



సమావేశంలో మాట్లాడుతున్న వీసీ





జనవరి 30

## గాంధీ వర్ధంతి

ఈ శతాబ్దపు భారతీయ స్ఫూర్తి ప్రదాత!
ప్రతి ప్రయోగాన్నీ సత్యావిష్కారం చేసిన విధాత!!
'మోహన్ దాస్ కరమ్ చంద్ గాంధీ'ని స్మరిస్తూ....

- నన్నయవాణి

## రక్తదానమే ప్రాణదానం



రక్తదాన శిబిరాన్ని సందర్శించిన వీసీ

**28.01.22 (మీడియాసెల్)** సమాజ సేవలో యువత ముందుండాలని, రక్తదానం చేసి ప్రాణాలను కాపాడాలని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీలో శుక్రవారం యూత్ రెడ్ క్రాస్ మరియు ఎన్. ఎస్. ఎస్. విభాగం సంయుక్త ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం, ప్రథమ చికిత్స శిక్షణా కార్యక్రమాలను నిర్వహించారు. వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. విశ్వవిద్యాలయ సిబ్బంది, విద్యార్థులు 31 మంది రక్తదానం చేసారు. అలాగే 40 మందికి ప్రథమ చికిత్సలో శిక్షణను అందించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో రక్తం అందక అనేకమంది చనిపోతున్నారని, అటువంటివారికి సమయానికి రక్తం అందించి రక్షించడంలో యువకులు ముందుండాలన్నారు. రక్తదానం చేయడం ద్వారా ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని, రక్తదానం ప్రాణదానమని తెలిపారు. అలాగే గుండెపోటు వంటి అత్యవసర పరిస్థితులు మరియు ప్రమాదాలలో ప్రథమ చికిత్స ఎంతో కీలక పాత్రను పోషిస్తుందన్నారు. యూత్ రెడ్ క్రాస్ ద్వారా విశ్వవిద్యాలయ అధ్యాపకులతో పాటు ఆయా కళాశాలలోని అధ్యాపకులకు ప్రథమ చికిత్సలో శిక్షణను అందించాలన్నారు. ప్రథమ చికిత్సలో మెళు కువలు అందరికీ తెలియడం ద్వారా అత్యవసర పరిస్థితుల్లో ఎంతో ఉపయోగపడుతుందన్నారు. యూత్ రెడ్ క్రాస్ మరియు ఎన్. ఎస్. ఎస్. ఆధ్వర్యంలో మరిన్ని సమాజహితమైన సేవలు ప్రజలకు అందించాలని సూచించారు. అనంతరం నిర్వాహకులను, అతిథులను సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, యూత్ రెడ్ క్రాస్ చైర్మన్ వై.డి. రామారావు, డా.మహాలక్ష్మి, ఎన్.ఎస్.ఎస్. కోఆర్డినేటర్ డా.బి. కెజియారాణి, యూత్ రెడ్ క్రాస్ కోఆర్డినేటర్ డా.పి.రాజశేఖర్ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## సంపాదకీయం



# దేశభక్తి

'పేట్రియాటిజం' అనే మాటకు పర్యాయపదంగా 'దేశభక్తి' పదాన్ని వాడుతున్నాం. కేంబ్రిడ్జి నిఘంటువు ఈ పదానికి" *When you love your country and proud of it*" అనే వివరణను ఇచ్చింది. దేశాన్ని ప్రేమించటం, దేశాన్ని చూసి గర్వించటం ఇవి దేశాభిమానానికి చెందిన అంశాలే. దేశభక్తి అనే పదబంధం చాలా క్లిష్టమైంది. దాని అర్థం అంత సరళమైందేమీ కాదు.

గలివర్ ట్రావెల్స్ రాసిన జోనాథన్ స్విఫ్ట్ 'డబ్లీ డయింగ్ 'అనే మాట వాడారు. దేశ భక్తి లేనివాడు రెండుసార్లు మరణించినట్లని. సహజంగా అందరూ ఒకసారి మరణిస్తారు, దేశభక్తి లేనివాడు రెండుసార్లు మరణిస్తాడని ఆయన ఉద్దేశం. దేశభక్తి లేనివాడు జీవించి ఉన్నా మరణించినట్లేనని ఆయన అభిప్రాయం. అంతేకదా!

సర్ వాల్టర్ స్కాట్ పండితుడు 'పేట్రియాటిజం' పోయెమ్ లో "ఆత్మ చచ్చిపోయినా ఊపిరి పీల్చే వాడేవడు. వాడికి ఊపిరి ఉన్నా లేనట్లే లెక్క. వాడు ఈ దేశంలో పుట్టి పెరిగి ఇక్కడ ఉంటున్నా వాడు విదేశీయునిక్రిందే లెక్క. ఏ నీచమైన దుమ్ములో నుంచి అతడు ఎలా పట్టుకుని వచ్చాడో, చివరికి అదే నీచమైన దుమ్ములోకి వెళ్ళిపోతాడు. అతనిని తలచేవారు కానీ, అతనిని కీర్తించే వారు కానీ, అతని కోసం కన్నీరు విడిచేవారు కానీ ఎవరు లేరు. ఉందరు..." ఇలా సాగుతుంది ఆ గేయం. ఇది దాని సారాంశం.

మాఖన్ లాల్ పూల్ కి చాహ్ హిందీ రచనలో " నిజమైన దాస్యశృంఖలాలను పోగొట్టి బానిసత్వం నుంచి స్వేచ్ఛ కోసం పోరాటం చేసి ప్రాణాలు అర్పించిన దేశభక్తుల సమాధి మత్తిమీద మాత్రమే నేను రాలిపోవాలని అనుకుంటున్నాను.." అంటుంది పుష్పం.'ఉదాత్త సమాధి మృత్తికన్' అన్నారు వేదుల సత్యనారాయణ శాస్త్రి గారు.

కావున దేశభక్తి అనేది సమాజానికి ఒక తప్పనిసరి సాంస్కృతికమైన ఈ అంశం మాత్రమే కాదు, భౌతికమైన అవసరం కూడా. భూభాగాల్ని ఆక్రమిస్తూ ఓటమి-గెలుపుగా సాగినంత కాలం దేశభక్తికన్నా రాజభక్తే రాజ్యమేలింది. ప్రాణాలొడ్డి యుద్ధం చెయ్యటమే రాజభక్తికి గల వ్యక్తీకరణ. కానీ దేశభక్తి జాతి ప్రయోజనానికి చెందింది. మన దేశ జాతీయ ఉద్యమమే మనల్ని ఒక జాతిగా రూపొందింపజేసిందనేది మనం ఒప్పుకోవాల్సిన నిజం. దానికి తోడు ప్రజాస్వామ్య రాష్ట్రోద్యమాలు భాషోద్యమాలు, సంస్కృతికోద్యమాలు ఒకదానికి మరొకటితోడై సమానత్వం, సౌభ్రాత్రం, లౌకికం, విశ్వ మానవత్వం, సామాజిక న్యాయం వంటి గొప్ప విలువలన్నీ మన ముందుకొచ్చాయి. **1857** ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామం నుంచి జాతీయోద్యమం వరకు మన జాతి చరిత్రలో ఒక మహత్తరమైన యుగం. మనల్ని మనంగా తీర్చిదిద్దింది.

మంగల్ పాండే బలిదానం నుంచి లక్ష్మీ బాయి, భగత్ సింగ్, సీతారామరాజు, నేతాజీ ....వీరందరి త్యాగాలను స్మరించుకునే ప్రతి అక్షరం మనకు ముఖ్యమైందే. "మహాత్ములు వచ్చారు, వెళ్ళారు. ధూళి రేగింది. అంతేకానీ ఎత్తుపల్లాలు ఏకం కాలేదు" అన్నారు బాబాసాహెబ్ అంబేద్కర్. దేశభక్తి ప్రపూరితమైన సమానత్వ భావనలు మాత్రమే మన సమాజంలోని అసమానతలను దూరం చేస్తాయి. "దేశమును ప్రేమించుమన్నా, మంచి అన్నది పెంచుమన్నా! వట్టిమాటలు కట్టిపెట్టోయ్, గట్టిమేల్ తలపెట్టవోయ్!!" నూటపదేళ్ల క్రితం గురజాడ రాసిన సరిహద్దులెరుగని ఈ అనంత భావాల సంగీతాన్ని నిత్యం స్మరించాల్సిందే. గత వైభవ స్మరణం కూడా దేశభక్తిని తట్టిలేపుతుంది.

సాంస్కృతిక పరాధీనతలోనికి వెళ్లిపోతున్న సుప్తమైన జాతిని జాగృతం చేయటానికి మహనీయులు, రచయితలు, కవులు, ఉద్యమకారులు... అనేక కోణాల్లో తట్టిలేపుతూనే ఉన్నారు. మనిషి తన అస్తిత్వాన్ని, కర్తవ్యాన్ని వెతుక్కునే ప్రతి ప్రయత్నం కూడా ముందుకు వెళ్లే మార్గమే!!

## ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఎమ్.ఎస్.ఎన్. క్యాంపస్ కాకినాడ




ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఎం. ఎస్. ఎన్ క్యాంపస్ నందు జాతీయ ఓటరు దినోత్సవాన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో క్యాంపస్ ప్రిన్సిపల్ డా. ఎం. కమల కుమారి మాట్లాడుతూ "ఓటు అనేది ప్రతి ఒక్క భారతీయునికి ప్రజాస్వామ్యం కల్పించిన ప్రాథమిక హక్కు అని, ఓటు ద్వారా సమసమాజ స్థాపన జరుగుతుందని, కుల, మత,జాతి, భాష, ప్రాంత భేదం లేకుండా ఈ ఓటు హక్కు అందరి సమానత్వాన్ని చాటుతుందని, ఇలాంటి ఓటు హక్కును ముఖ్యంగా యువ భారతావని వినియోగించుకొని భారత దేశ అభివృద్ధిలో తమవంతు పాత్ర వహించాలని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఎన్. ఎస్. ఎస్. అధికారులు డా. ఎల్. మధు కుమార్ , వి.శ్రీనివాస్ వివిధ విభాగాల అధిపతులు, బోధన, బోధనేతర సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొని ప్రతిజ్ఞ చేశారు.

## తాడేపల్లిగూడెంలో రిప్లబిక్ డే వేడుకలు



ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం తాడేపల్లిగూడెం క్యాంపస్ లో రిపబ్లిక్ డే సందర్భంగా క్యాంపస్ ప్రిన్సిపల్ ఆచార్య కె.ఎస్.రమేష్ పతాకావిష్కరణ చేశారు. గణతంత్ర దినోత్సవ ప్రత్యేకతను,రాజ్యాంగ నిర్మాణ విశేషాల్ని వివరించారు. ఈ కార్యక్రమంలో కాంపస్ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## మంచి మాట

విద్య నేర్చుకునేటప్పుడు గతంలో తానేమీ నేర్చుకోలేదని భావించి కొత్త విషయాలు నేర్చుకుంటూ ఉండాలి.గుణపాఠాల విషయంలో మాత్రం పాత అనుభవాన్ని నిత్యం పునశ్చరణ చేసుకుంటూ ఉండాలి.

ఒకప్పుడు స్వాతంత్ర్యాన్ని కోల్పోయిన భారతీయులు గుర్తుంచుకోవాల్సిన పరమ సత్యమిది.

- డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్

## ఆక్వా కల్చర్ విభాగంలో అతిథి ఉపన్యాసం

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం సైన్స్ కళాశాలలో ఆక్వా కల్చర్ పై అవగాహన సదస్సు జరిగింది. అవంతి ఫీడ్ కంపెనీ లిమిటెడ్ ఏరియా మేనేజర్ డి.సాంబయ్య ఆక్వా కల్చర్ ఫీడ్ మేనేజ్మెంట్ పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. వారి సందేహాలను నివృత్తి చేశారు. అవంతి కంపెనీ ప్రతీ ఏడాదీ యూనివర్సిటీ క్యాంపస్ డ్రైవ్ నిర్వహిస్తోందని విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కలుగుతున్నాయని విభాగాధిపతి ప్రిన్సిపాల్ డా.కె. రమణేశ్వరి అన్నారు. ఈ సదస్సులో అధ్యాపకులు డా.మాట్టారెడ్డి, డా.విజయనిర్మల డా.కళ్యాణి డా.శ్రీధర్, సైన్స్ కళాశాల విద్యార్థులు పరిశోధకులు పాల్గొన్నారు.




## జియోఫిజికల్ డేటా ప్రాసెసింగ్


# శిక్షణలో నన్నయ విద్యార్థులు



శిక్షణా తరగతులకు వెళ్ళిన జియోఫిజిక్స్ విద్యార్థులు

జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్, హైదరాబాద్లో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఎంఎస్సి జియోఫిజిక్స్ విద్యార్థులు శిక్షణ పొందారు. ఆజాదీ కా అమృతోత్సవ్లో భాగంగా భారత ప్రభుత్వం, జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్, హైదరాబాద్ వారు "సాఫ్ట్వేర్ని ఉపయోగించి జియోఫిజికల్ డేటా ప్రాసెసింగ్"పై శిక్షణను నిర్వహించారు. 03.01.2022 నుండి 07.01.2022 వరకు జియోఫిజికల్ డేటా ప్రాసెసింగ్ లో సాఫ్ట్వేర్ ని ఉపయోగించడంపై శిక్షణ పొందారు. శిక్షణ అనంతరం విద్యార్థులకు నిర్వాహకులు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు మాట్లాడుతూ ఇటువంటి శిక్షణ తరగతులు విద్యార్థులకు ఎంతో ఉపయోగపడతాయని తెలియజేశారు. శిక్షణలో తాము నేర్చుకున్న విషయాలను ఇతరులకు తెలియజేస్తూ తమ జ్ఞానాన్ని మరింత పెంపొందించుకోవాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని విద్యార్థులు అందిపుచ్చుకొని నూతన ఆవిష్కరణలు చేయాలన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య టి. అశోక్, విభాగాధిపతి డా.కె.నూకరత్నం,ఆచార్య వై. శ్రీనివాసరావు, విభాగ అధ్యాపకులు విద్యార్థులను అభినందించారు.



# ఆఫ్ఘనిస్థాన్ సంక్షోభంపై పుస్తకం విడుదల


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ జగన్నాథరావు

**25.01.22 (మీడియాసెల్)** ఆఫ్ఘనిస్థాన్ సంక్షోభం భారతీయ రాజకీయ,ఆర్థిక వ్యవస్థలపై ఏ విధమైన ప్రభావం ఉంటుంది, వాటి నుండి బయటపడే మార్గాలను మేధావుల సూచనలతో పొలిటికల్ సైన్స్ విభాగం వారు పుస్తకాన్ని ప్రచురించారని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు తెలిపారు. మంగళవారం యూనివర్సిటీలోని వీసీ కార్యలయంలో వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు పుస్తకాన్ని ఆవిష్కరించి వివరాలను తెలియజేసారు. వీసీ మాట్లాడుతూ 08.09.2021 తేదీన ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఈసీ హాల్ లో "భారతీయ రాజకీయ వ్యవస్థ మరియు ఆర్థిక వ్యవస్థలపై ఆఫ్ఘనిస్తాన్ సంక్షోభ ప్రభావం" అనే అంశంపై రౌండ్ టేబుల్ చర్చ జరిగిందన్నారు. ఆఫ్ఘనిస్థాన్ ను తాలిబన్లు ఆక్రమించుకోవడంతో ఏర్పడిన సంక్షోభ ప్రభావం భారత దేశంలోని రాజకీయ, ఆర్థిక వ్యవస్థలపై ఏ విధంగా ఉందనే పలు అంశాలు ఈ సమావేశంలో చర్చించారని చెప్పారు. దీనిలో సమావేశంలో మేధావులు, నిపుణులు, రాజకీయ విశ్లేషకులు సంక్షోభ ప్రభావం నుండి బయటపడే మార్గాలను సూచించారని తెలిపారు. రౌండ్ టేబుల్ సమావేశంలో చర్చించిన అంశాలను పుస్తక రూపంలో పొలిటికల్ సైన్స్ విభాగం ప్రచురించిందని అన్నారు. ఈ పుస్తకంలో ప్రధానంగా ఆఫ్ఘన్ సంక్షోభం యొక్క అవలోకనం అనే అంశంపై జె.ఎన్.టి.యు.కె. అధ్యాపకులు డా. ఆలపాటి శ్రీనివాస్, తాలిబాన్ల మూలం మరియు పెరుగుదల అంశంపై వర్సిటీ అధ్యాపకులు జె. సురయ్య, తాలిబాన్లు ఆఫ్ఘనిస్తాన్ను ఎలా స్వాధీనం చేసుకున్నారు అనే అంశంపై డా. ఎన్. రాజశేఖర్, భారత విదేశాంగ విధానం – ఆఫ్ఘన్ సంక్షోభం ప్రభావం అనే అంశంపై డా.కె.యామినిజ్యోత్స్న, ఆఫ్ఘన్ సంక్షోభం –యు.ఎన్.ఓ పాత్ర అనే అంశంపై డా.బి.వి.వి.బాలకృష్ణ, ఆఫ్ఘనిస్తాన్ సంక్షోభం – దాని పొరుగు దేశాల పాత్ర అనే అంశంపై –డా.ఎం.సత్యనారాయణ, ఇండో – ఆఫ్ఘన్ సంబంధాలు అనే అంశంపై డా.ఎన్.నానిబాబు, ఆఫ్ఘన్ సంక్షోభంపై భారతదేశ వైఖరి అనే అంశంపై డా.జె.స్టీఫెన్ కొమ్మూర, ఆఫ్ఘనిస్తాన్లో మానవ హక్కుల ఉల్లంఘన అంశంపై డా.కె.హరిబాబు, ఆఫ్ఘనిస్తాన్ సంక్షోభంపై ఇస్లామిక్ ప్రపంచ స్టాండ్ అనే అంశంపై డా.ఎం.గోపి, ఆఫ్ఘన్ సంక్షోభం: భారతదేశ దిగుమతులు మరియు ఎగుమతులపై ప్రభావం అనే అంశంపై డా. పి. లక్ష్మీనారాయణ, ఆఫ్ఘనిస్తాన్ సంక్షోభం: భారతీయ ఆర్థిక వ్యవస్థపై దీని ప్రభావం అనే అంశంపై డా.కె.నిర్మల తెలియజేసిన అంశాలను ప్రచురించారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.టేకి, డిపార్ట్మెంట్ ఆఫ్ పొలిటికల్ సైన్స్ అధ్యాపకులు పాల్గొన్నారు.

## శ్రమైక జీవన సౌందర్య లతిక



ఆకాశం! ఆమె కన్నీటి చుక్క!
పురిటి వేదనకోర్చిందంటే
అవని అంతా పచ్చనికోక
తలరాతను తడుముకుంటూ
తలకెత్తుకున్న బాధ్యతల మొక్క
రాళ్ళెన్ని గుచ్చుకున్నా
రాదారిలో ఆగని నడక
చీకటిని చిదిమేస్తూ
అరవిచ్చే దీపశిఖల మొలక
గుండెలో రగిలేటి దుఃఖాల
కొలిమున్నా
మోము పైన విరిసేటి
చిరునవ్వుల మరుమల్లె లతిక!
రేపంటే కలలను మోసే
భుజాల రెక్క
బతుకు చేదను లాగే శ్రమైక
జీవన స్వేద గిలక
కోతలెన్ని మనసుకున్నా
మమత వీడి మరలిపోయిందా
తనవారి కోసం ప్రాణాలొడ్డే
యోధత్వపు మెరుపు దాడి
కదలిక
యుగాలనాటి గమనంలో
ఉనికే విస్ఫోటనమైనా
విశ్వ ప్రేమ గీతాలనుపాడే
అమ్మతనపు లాలిత్యపు
మరీచిక!

– సుమన ప్రణవ్

## ఉపకులపతి ఉవాచ

### బాపూజీ !




ఎవరి జన్మ భారతీయ సమాజానికి ప్రఖ్యాతమై నిలిచిందో, ఎవరి రూపం స్వదేశీ మంత్రమై విలసిల్లిందో, ఎవని దీక్షాయజ్ఞం ఈ సమాజ బానిస సంకెళ్లను తొలగించే మంత్రమై విరాజిల్లిందో,ఎవని ధర్మనిష్ఠ దేశ ప్రజలకు స్వేచ్ఛను అందించిందో... అటువంటి విశ్వమానవ విధాత గాంధీ మహాత్ముడు.

ఆయన బోధించిన శాంతి, సత్యం, అహింస, హరిజనోద్ధరణ, దీన జన సేవ, పితృవాక్య పరిపాలన, మాతృభక్తి, సర్వమత సమత్వం మొదలైన అంశాలు, బోధనలు విశ్వమానవాళికి, నేటి సమాజానికి నిరంతరం అవసరమే. అనుసరణీయమే. గాంధీజీ బోధనలు ప్రజల పురోభివృద్ధికి వెలుగు బాటలు!!

లోకోత్తరమైన గాంధీజీ ఆత్మకథ 'సత్యశోధన' (My Experiments With Truth) ను ప్రతివ్యక్తి,ముఖ్యంగా విద్యార్థులు, అధ్యాపకులు తప్పనిసరిగా అధ్యయనం చేయాలని కోరుతున్నాను.

మొక్కా జగన్నాథరావు

# దాతలు సమర్పించిన పుస్తక భాండాగారం


డొనేటెడ్ వింగ్ అభివృద్ధి బాధ్యతను డా.తలారి వాసుకి అప్పగిస్తున్న వీసీ.

**27.01.22 (మీడియాసెల్)** పుస్తకాలు కాల సాగరతీరాన లైట్ హౌసులని, అపరిమితమైన జ్ఞాన కాంతిని,విజ్ఞాన సముపార్జనను అందించటానికి పుస్తకమే కారణమని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. విశ్వవిద్యాలయం తెలుగు శాఖలో సహాయ ఆచార్య సేవలందిస్తున్న డా.తలారి వాసు పదేళ్లపాటు నన్నయ విశ్వవిద్యాలయానికి సుమారుగా 11 వేల విలువైన గ్రంథాలను సేకరించారని వీటితో విశ్వవిద్యాలయ కేంద్ర గ్రంథాలయంలో ఒక ప్రత్యేకమైన పుస్తక భాండాగారం కొద్దిరోజుల్లో నెలకొల్పటానికి ఏర్పాట్లు జరుగుతున్నాయని అన్నారు. తెలుగులో విలువైన గ్రంథాలతోపాటు ఆంగ్లం, సైన్స్, కంప్యూటర్ సైన్స్, ఇంజనీరింగ్, ఫైన్ ఆర్ట్స్, సోషల్ సైన్సెస్ విషయాల్లో అరుదైన గ్రంథాలకు ఇది చిరునామా కాబోతుందని తెలిపారు. రాబోయే రోజుల్లో ఈ వింగ్ ను అభివృద్ధి చేసి విద్యార్థులకు, అధ్యాపకులకు, పరిశోధకులకు, సమాజానికి ఉపయోగపడేలా తీర్చిదిద్దాలని సమన్వయకర్త బాధ్యతను అప్పగించారు. నన్నయ అధ్యయన కేంద్రం వంటిది కూడా ఇందులోనే ఏర్పాటు చేస్తే ఉభయగోదావరి జిల్లాల కవులు, రచనలు, సాహిత్య ,సాంస్కృతిక అంశాలపై అధ్యయనం, పరిశోధనలకు ఉపకరిస్తుందని అన్నారు. చిరిగిన చొక్కా అయినా తొడుక్కో కాని మంచి పుస్తకం కొనుక్కోమని కందుకూరి వీరేశలింగం గారు, పుస్తకమున్న పూరి గుడిసెనైన నివశిస్తానని కవులు పుస్తకం యొక్క గొప్పతనాన్ని తెలియజేశారని గుర్తు చేశారు. విశ్వవిద్యాలయానికి ఇప్పటివరకు విలువైన గ్రంథాలను బహూకరించిన దాతలకు కృతజ్ఞతలు తెలుపుతూ మంచి పుస్తకాలను తమ పేరు మీదుగా విశ్వవిద్యాలయంలోని ఈ విభాగానికి సమర్పించవచ్చునని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి. అశోక్, కేంద్ర గ్రంథాలయ సమన్వయకర్త డా.కె.రామణేశ్వరి, గ్రంథాలయాధికారి డా.తెర్లి సింహాచలం, సహకరిస్తున్న డా.పి. రాజశేఖర్,డా. నారాయణ నక్కిన పాల్గొన్నారు.

# బాలిక చట్టాలపై అవగాహన పెరగాలి

**24.01.22 (మీడియాసెల్)** బాలికల విద్య, ఆరోగ్య,రక్షణకు సంబంధించి ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నాయని, బాలిక సంరక్షణపై ప్రత్యేక చట్టాలు ఉన్నాయని వాటిపై అవగాహన ఎంతో అవసరమని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ మహిళా సాధికారత, అభివృద్ధి మరియు గ్రీవెన్స్ సెల్ ఆధ్వర్యంలో జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా "ఆడపిల్లను రక్షించండి – చట్టపరమైన రక్షణలు" అనే అంశంపై సోమవారం ఆన్లైన్ సదస్సును నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు మాట్లాడుతూ బాలికలకు అన్ని రంగాల్లో ప్రత్యేక హక్కులు ఉన్నాయని వాటిపై అవగాహన కల్పించి వాటి ఫలాలను అందించాలని తెలిపారు. బేటి బచావో బేటి పడావో పేరుతో ప్రభుత్వం కార్యక్రమాలను, ప్రోత్సాహాలను అందిస్తుందని చెప్పారు. భ్రూణహత్యల నిర్మూలనకు ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు,చట్టాలు తీసుకువచ్చారని చెప్పారు. కొన్ని ప్రాంతాలలో ఆడపిల్లలను బరువుగా భావించి బాల్యవివాహాలకు చేస్తున్నారని ఇది చట్టరీత్యా నేరమని అటువంటి వారికి విద్యావంతులు అవగాహన కల్పించాలన్నారు. బాల్యవివాహాల ద్వారా భవిష్యత్ లో ఎన్నో అనర్థాలు సంభవిస్తాయని చెప్పారు. బాలికలలో పోషకాహార లోపం అధికంగా ఉంటుందని, నాణ్యమైన పౌష్టికాహారాన్ని వారికి అందించాలన్నారు. సమాజంలోని బాలికలు,మహిళల ఉన్నతికి విద్య ఎంతో కీలక పాత్రను పోషిస్తుందని అన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం క్యాంపస్ లో ఎక్కువ శాతం మహిళా విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించడం ఆనందనీయమన్నారు. బాలిక సంరక్షణ మనందరి బాధ్యత అని, సమాజంలో బాలికలు ఉన్నత స్థానాలకు ఎదగాలని వీసీ సూచించారు. తరువాత ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళ కమీషన్ డైరెక్టర్ ఆర్.సుయిజ్, బేటీ బచావో బేటీ బడావో ఆంధ్రప్రదేశ్ కోకన్వీనర్, ప్రముఖ న్యాయవాది రహీమున్నీసాబేగం బాలిక సంరక్షణ చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ మహిళా సాధికారత, అభివృద్ధి మరియు గ్రీవెన్స్ సెల్ కోఆర్డినేటర్, కన్వీనర్ డా.కె.నూకరత్నం, డా.ఎం.కమలకుమారి, డా.పి.ఉమమహేశ్వరి, ప్రిన్సిపాల్స్, డీన్స్, అధ్యాపకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వీసీ జగన్నాథరావు

# శ్రీ గరికిపాటికి పద్మశ్రీ - అభినందనలు!!


గరికిపాటిపై పరిశోధన గ్రంథం గురించి మాట్లాడుతున్న వీసీ.

**29.01.22 (మీడియాసెల్)** మహా సహస్రావధాని డా. గరికిపాటి నరసింహారావు గారికి కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ పురస్కారాన్ని ప్రకటించిన సందర్భం చాలా సంతోషదాయకమని మహత్తరమైందని, వారి అవధానాలతో, రచనలతో,ముఖ్యంగా ఉపన్యాసాలతో సమాజాన్ని సామాజికంగా చైతన్యవంతం చేస్తున్నారని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. ఈ సందర్భంగా శ్రీ గరికిపాటి వారికి విశ్వవిద్యాలయం తరపున శుభాభినందనలు తెలియజేశారు. పశ్చిమ గోదావరి జిల్లా వాసులైనా ఎక్కువ కాలం కాకినాడలోనే ఉంటూ అధ్యాపక జీవితాన్ని గడిపారని, ప్రతి ప్రాంతంలో ఉపన్యాసాలను ఇచ్చారని గుర్తు చేశారు. అంతేకాక సోషల్ మీడియాలో వివిధ టివి ఛానళ్లలోవారి ఉపన్యాసాలు ప్రజల్ని, ముఖ్యంగా యువతను చైతన్యవంతం చేస్తున్నాయని, తీర్చి దిద్దుతున్నాయని, సమాజానికి ఉపయోగపడే అంశాలుగా ఉన్నాయని అన్నారు. నన్నయ విశ్వవిద్యాలయం తెలుగు శాఖలో సహాయాచార్యగా సేవలందిస్తున్న డా.తలారి వాసు గరికపాటి వారి 'సాగరఘోష కావ్యం – సామాజిక అద్వైతం' అంశంపై ఆంధ్ర విశ్వవిద్యాలయంలో 2006 నుండి 2009 వరకు పీహెచ్.డి. పరిశోధన చేసి డాక్టరేట్ పట్టమును పొందారని, ఆ గ్రంథాన్ని శ్రీ గరికిపాటి వారే ముచ్చటపడి వేయి ప్రతులను ప్రచురించటమే కాక, ఎలక్ట్రానిక్ మీడియాలో నన్నయ విశ్వవిద్యాలయ అధ్యాపకుని గురించి ప్రశంసల్ని అందించారని, ఆ గ్రంథానికి విశాఖపట్నం ప్రసన్న భారతి సంస్థ నుండి ఉత్తమ సంప్రదాయ సాహిత్య విమర్శ పురస్కారం లభించిందని ఈ సందర్భంగా విశ్వవిద్యాలయం ఎంతో సంతోషాన్ని పొందుతుందని వీసి కొనియాడారు.వీసీ ఆచార్య జగన్నాథరావు, రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్,విశ్వవిద్యాలయ కేంద్ర గ్రంథాలయ సమన్వయకర్త డా.కె.రమణేశ్వరి శ్రీ గరికిపాటి కుటుంబానికి శుభాభినందనలు అందించారు.

### ధన్యోస్మి

శ్రీ గరికిపాటి వారికి శుభాకాంక్షలు. వారి రచనలపై పరిశోధన చేసే అదృష్టం నాకు.దక్కింది. వారి అభిమానాన్ని పొందగలిగాను. విశ్వవిద్యాలయ అధికారుల సహకారం మరువలేనిది.

**- డా.తలారి వాసు**

## ఏయూ పూర్వ ఉపకులపతి ఆచార్య రొక్కం రాధాకృష్ణకు నివాళి



ఆంధ్ర విశ్వవిద్యాలయానికి 12 ఉప కులపతిగా 1998 నుంచి 2001 వరకు విశేష సేవలందించిన నిరాడంబర విద్యావేత్త, ఆర్థిక శాస్త్ర సామాజిక విశ్లేషణకర్త, పరిపాలనాదక్షులు ఆచార్య రొక్కం రాధాకృష్ణ అని, ఆయన మరణం విద్యా రంగానికి తీరని లోటని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. వారికి నివాళిని అర్పిస్తూ ప్రత్యేక ముద్ర వేశారని,పేజీలో సెమిస్టర్ విధానం, పరీక్షల్లో గ్రేడింగ్, సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులను ప్రారంభించడం, రీసెర్చ్ ఫోరమ్ బలోపేతం చేయడం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇచ్చారని వారి సేవా కాలంలోనే ఏపీజే అబ్దుల్ కలాంకి గౌరవ డాక్టరేట్ ప్రదానం చేశారని అన్నారు. ఏయూ పరిపాలన విభాగాల్లో ఆ రోజుల్లో తనకు బాధ్యతలను అప్పగించే వారిని గుర్తు చేసుకుంటూ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ వారి ఆత్మకు శాంతి కలగాలని నివాళులర్పించారు.

# ఎండ్లూరి సుధాకర్‌కి నివాళి




**28.01.22 (మీడియాసెల్)** ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాల తెలుగు విభాగంలో ప్రముఖ కవి, విమర్శకులు, ఉపన్యాసకులు, కేంద్రీయ విశ్వవిద్యాలయం ఆచార్యులైన ఆచార్య ఎండ్లూరి సుధాకర్ కి నివాళులర్పించారు. ఆయన హఠాత్ మరణం తెలుగు సాహిత్య లోకాన్ని దిగ్భ్రాంతికి గురి చేసిందని, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంతో వారికి ఎంతో అనుబంధం ఉందని రాజమహేంద్రవరంలోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలోని ఆచార్యునిగా డీన్ గా సేవలందిస్తూ అనేక సందర్భాలలో, సదస్సులలో విశ్వ విద్యాలయానికి విచ్చేసి ఉపన్యసించారని ప్రిన్సిపల్ ఆచార్య ఎస్.టేకి అన్నారు. తెలుగు శాఖాధిపతి డాక్టర్ కె.వి.ఎన్.డి. వరప్రసాద్ సుధాకర్ గారితో ఉన్న పరిచయాన్ని, మంచితనాన్ని, వారి ప్రాసలు, పదబంధాల్ని వివరించి గుర్తు చేసుకున్నారు. తెలుగుశాఖ అధ్యాపకులు డా.తలారి వాసు, డా.తరపట్ల సత్యనారాయణ, డా.డి. లక్ష్మీ నరసమ్మ ఎండ్లూరి సాహిత్యాన్ని, కవిత్వాన్ని విద్యార్థులకు పరిచయం చేశారు.వర్తమానం,నల్లద్రాక్ష పందిరి,జాషువా సాహిత్య దృక్పథం, 'ఆటా'జని కాంచె వంటి రచనలను పరిచయం చేశారు. కార్యక్రమంలో తెలుగు శాఖ పరిశోధక విద్యార్థులు,ఎమ్.ఏ. విద్యార్థులు పాల్గొన్నారు.

## చావుని చంపండి

రాత్రి రంపం మీద
నిదుర చెక్కనై పొట్టు పొట్టుగా
రాలిపడుతూ ఉంటాను.
పగటి గోడమీద
అసహనపు మేకులా దిగబడి
సగందేహంతో సందేహంతో
ఒంటరితనపు తాడుమీద
ఒక్కణ్ణే నడుస్తూ ఉంటాను.

అప్పుడప్పుడు చావుచింత
చీకట్లో కుక్కలా
వెంటాడుతూ ఉంటుంది.
అపరిచిత యువతిలా
మృత్యురాణి తారసపడితే
ముద్దుపెట్టుకోవడానికివెనుకాడననిజి
ఆమెకెవరైనా చెప్పండి





నాతో లేచిపోయే ధైర్యాన్ని
సంపాదించుకోమని.

ఎండ్లూరి సుధాకర్
21.1.1959 - 28.1.2022

## 'యూనివర్సిటీ పరిసరాలు'

ఆగస్ట్ లో వానహాయ్..
మే నెల్లో ఎండ హాయ్..
జనవరిలో మంచు హాయ్..
హాయ్ రామా హాయ్ హాయ్..

ఫోటోలు: పి.వీరదుర్గ (పండు) సెక్యూరిటీ సెక్షన్.



## నన్నయలో గాంధీ వర్ధంతి


గాంధీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పిస్తున్న దృశ్యం.

**30.01.22 (మీడియాసెల్)** ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో మహాత్మా గాంధీజీ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. రిజిస్ట్రార్ ఆచార్య టి. అశోక్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యావద్భారత దేశానికి సత్యం, అహింస ఆయుధాలతో స్వాతంత్ర్యాన్ని సాధించిన మహనీయుడు గాంధీజీ అని కొనియాడారు. భారత దేశంతో పాటు ప్రపంచ దేశాలు గాంధీజీ ఔన్నత్యాన్ని కొనియాడుతున్నారని తెలిపారు. జాతిపితగా అందరికీ ఆదర్శమూర్తిగా మహాత్మాగాంధీ నిలిచారని తెలిపారు. అలాగే జాతీయోద్యమంలో తమ ప్రాణాలను త్యాగం చేసిన మహనీయులకు అమరవీరుల దినోత్సవ సందర్భంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో డా. కె.వి స్వామి, డా.ఎం. గోపాలకృష్ణ పాల్గొన్నారు.

ప్రచురణ : మీడియా సెల్, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం-రాజమహేంద్రవరం, ఈమెయిల్ :- nannayavani@aknu.edu.in